క్లుప్తంగా

వసతిగృహంలో దోమల నివారణ చర్యలు



భీమనపల్లిలో దోమల నివారణ చర్యలు చేపడుతున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహంలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది దోమల నివారణ, ప్రత్యేక పారిశుధ్య చర్యలు బుధవారం చేపట్టారు. వసతి గృహంలోని విద్యార్థులకు, సిబ్బందికి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో రామకృష్ణ, హాస్టల్ వార్డెన్ ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హితకారిణి సమాజం భూముల కౌలుకు వేలం పాట



ఉప్పంగలలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

తాళ్లరేవు: ఉప్పంగల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 4.30 సెంట్ల హితకారిణి సమాజం భూముల కౌలుకు సంబంధించి బుధవారం వేలం పాట నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సమాజం ఈఓ రాధ పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించగా పలువురు రైతులు పాడుకున్నారు. పల్లిపాలెం గ్రామానికి చెందిన మట్టపర్తి గోవిందు అనే రైతు రూ.1.02 లక్షలకు పాడుకున్నారని, గతం కంటే రూ.12 వేలు అదనంగా ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శాకా శంకరుడు, దవులూరి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో 8వ తరగతిని బోధించాలి



డీఈవో కమలాకుమారికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు కనకదుర్గ

అమలాపురం రూరల్: మండలంలోని చిందాడగరువు గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతిని బోధించాలని కోరుతూ డీఈఓ కె.కమలాకుమారికి ఎంపీటీసీ సభ్యురాలు మోటూరి కనకదుర్గ బుధవారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన డీఈవో కమలాకుమారి చిందాడగరువు పాఠశాల హెచ్ఎం కృష్ణవేణికి ఫోన్ చేసి ఎనిమిదో తరగతి ఏర్పాటు ప్రతిపాదనాలను సిద్ధం చేసి పంపించాలని ఆదేశించారు.

ఇంటర్నేషనల్ యోగా డేకు ఏర్పాట్లు

యానాం: పుదుచ్చేరి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగాదినోత్సవానికి స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్‌ఏఓ మునిస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7.30 గంటల నుంచి ప్రారంభమయ్యే యోగా ప్రదర్శనకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎస్పీ రాజశేఖరన్, జీజీహెచ్ డీడీ రవిశంకర్, ఆయుష్ వైద్యులు డాక్టర్ స్టాన్లీ స్టీవెన్‌సన్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ పాల్గొంటారన్నారు.

జవహర్‌కు అదనపు బాధ్యతలు

యానాం: పుదుచ్చేరి ప్రధాన ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న పి.జవహర్‌కు విద్య, పరిశ్రమలు, వాణిజ్యం, స్థానిక పరిపాలన శాఖ, ఫారెస్ట్ అండ్ వైల్డ్ లైఫ్, సైన్స్, టెక్నాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్‌లకు కమిషనర్ కమ్ సెక్రటరీ టు గవర్నమెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎల్జీ రాధాకృష్ణన్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు తక్షణం అమలులోకి వస్తాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్‌చౌహాన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన సదస్సు

కాట్రేనికోన: కాట్రేనికోన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి నీలిమ ఆధ్వర్యంలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యురాలు నీలిమ మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి తల్లిదండ్రుల నుండి జన్యు పరంగా సంక్రమిస్తుందన్నారు. ఈ వ్యాధి ప్రభావంతో ప్లీహం, ఊపిరితిత్తులు, కిడ్నీల సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీహరి, ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు

- ఊపందుకున్న ఖరీఫ్ పనులు
- ఉరుకులు పరుగులు పెడుతున్న రైతులు



ముమ్మిడివరంలో నారుమడిని సిద్ధం చేసుకుంటున్న రైతులు

ముమ్మిడివరం: ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది ముమ్మిడివరం సబ్ డివిజన్ పరిధిలో 30,200 ఎకరాల్లో సాగు చేపట్టాలని లక్ష్యంగా కాగా ఇప్పటికే నారు మడులు సిద్ధం చేశారు. గత మూడు రోజులుగా రైతులు పంట పొలాలు దుక్కి దున్ని నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ముమ్మిడిరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల్లో ఇప్పటికే నాట్లు వేసే పనిలో రైతులు బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో నాట్లు ఆలస్యమైనా అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని ముమ్మిడివరం ఏఓ ఎస్.ప్రశాంతకుమార్ తెలిపారు.

ఆరోగ్యకరమైన నారు పంటకు శ్రీరామ రక్ష

ఆరోగ్యకరమైన నారు పంటకు శ్రీరామ రక్ష అని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందుకే నారు పెంపకంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. విత్తనాలు వేసే ముందు నారుమడిని 11 నుంచి 12 రోజులు ముందుగా దుక్కి దున్ని చదును చేసుకోవాలని, నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా నారుమడుల్లో చిన్న చిన్న బోదెలు ఏర్పాటు చేసుకోవాలని ఏఓ ప్రశాంత్‌కుమార్ చెబుతున్నారు. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఎయం దుక్కిలో వేయాలని వివరించారు. సెంటు నారుమడిలో 5 కిలోల మొలక కట్టిన విత్తనాలు చల్లాలన్నారు. నారు ఒక ఆకు పురివిచ్చుకునే వరకూ ఆరు తడులు పెడుతూ తర్వాత మడిలో పలచగా నీరు పెట్టాలని చెప్పారు. నారుమడిలో జింకు లోపం కనిపిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేటు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. సెంటు నారు మడికి 150 గ్రాముల 3జీ గుళికలు లేదా 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ లేదా 2.0 మి.లీ. క్లోరిపైరిపాస్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

నాట్లు వేసే ముందు జాగ్రత్తలు

చేలలో నాట్లు వేసే ముందు తగు జాగ్రత్తలు తీసుకుంటే చీడపీడల నుంచి వరి మొక్కలను రక్షించుకోవచ్చని వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతకుమార్ తెలిపారు. నాట్లు వేయడానికి వారం రోజులు ముందు 5 సెంట్ల నారుమడికి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 800 గ్రాములు వేసుకోవాలన్నారు. అలా చేయడంవల్ల నాట్లు వేసిన 21 రోజుల వరకూ వరి మొక్కలపై ఎటువంటి చీడపీడలు వ్యాపించవన్నారు. నాట్లు చదరపు మీటరుకు 33 మొక్కలు ఉండేలా వేయాలన్నారు. ఖరీఫ్ ఆలస్యం కాకుండా రైతులంతా వెదజల్లు సాగు చేపడితే మంచిదని సూచించారు. దీనివల్ల 15 రోజులు ముందుగా పంట చేతికొచ్చే అవకాశముందన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు సత్కారం



ఫీల్డ్ అసిస్టెంట్లు ఏడుకొండలు, శ్రీనివాస్‌లను సత్కరిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు అధిక పని దినాలు కల్పించిన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సత్కరించారు. ఏపీఓ శ్రీనుబాబు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వారాంతపు సమీక్షా కార్యక్రమంలో దేవగుప్తం పంచాయతీ పరిధిలో 27,590 పని దినాలు కల్పించిన ఫీల్డ్ అసిస్టెంట్ గెద్దం ఏడుకొండలు, 98 కుటుంబాలకు 100 రోజుల పాటు పని దినాలు కల్పించిన ఓడలరేవు ఫీల్డ్ అసిస్టెంట్ మధుర శ్రీనివాస్‌లను ఎంపీడీఓ కృష్ణమోహన్ పూలమాల వేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు అంకితభావంతో పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన ఫీల్డ్ అసిస్టెంట్లు సైతం ఉపాధి పని దినాలు కల్పించడంలో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మణరావు, ఉపాధి కార్యాలయ సిబ్బంది అనిల్, నాగేశ్వరరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై గ్రామస్తుల ఆందోళన



తాళ్లరేవు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామస్తులు

తాళ్లరేవు: గత కొద్ది రోజులుగా విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ కోరంగి పంచాయతీ పెద బొడ్డు వెంకటాయపాలెం గ్రామస్తులు తాళ్లరేవు సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం రాత్రి ఆందోళన నిర్వహించారు. వారికి ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ గత రెండు రోజులుగా పెదబొడ్డు వెంకటాయపాలెం మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద నాలుగు కుళాయిల సెంటర్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయకపోవడంతో విద్యుత్ సౌకర్యం లేక గ్రామస్తులు అల్లాడిపోయారన్నారు. చిన్నారులు, వృద్ధుల ఇబ్బందులైతే వర్ణనాతీతమన్నారు. ఈ సమస్యను పరిష్కరించి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేబుల్ షార్టేజ్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని, సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

ఎస్‌సీడీపై అవగాహన అవసరం



అంబాజీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

అంబాజీపేట: సికిల్ సెల్ డిసీజ్ (ఎస్‌సీడీ) అనేది వారసత్వంగా వచ్చే రక్తరుగ్మత అని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి కేవీఎస్ శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సీహెచ్‌ఓ బి.అప్పారావు అధ్యక్షతన ఎస్‌సీడీ దినం పురస్కరించుకుని అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి అనేది హిమోగ్లోబిన్ ప్రభావితం చేసే రుగ్మతల సమూహమన్నారు. హిమోగ్లోబిన్ శరీరంలోని వివిధ కణాలకు ఆక్సిజన్ సరఫరా చేయడంలో కీలకపాత్ర వహిస్తుందన్నారు. సాధారణ ఎర్ర రక్త కణాలతో పోలిస్తే, అవి కేవలం 10–20 రోజులు మాత్రమే జీవించి ఉంటాయన్నారు. సాధారణ ఎర్ర రక్త కణాలు 90–120 రోజుల వరకు జీవించి ఉంటాయన్నారు. దీని ఫలితంగా ఎర్ర రక్తకణాల సంఖ్య తగ్గి రక్తహీనతకు దారితీస్తుందని వివరించారు. ర్యాలీలో పీహెచ్‌ఎన్ రత్నకుమారి, హెచ్‌వీ శాంతకుమారి, ఎల్‌టీ రవితేజ, ఎంఎల్‌హెచ్‌పీ దీన, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు: తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీ కార్యాలయాల్లో బుధవారం వైద్యారోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో వలస కార్మికులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు.

వీరవల్లిపాలెం పీహెచ్‌సీలో..

అయినవిల్లి: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై వీరవెల్లిపాలెం పీహెచ్‌సీ వద్ద గ్రామస్తులు, బాలబాలికలకు బుధవారం వైద్యాధికారి సౌజన్య అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పలువురికి రక్త పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ సలాది బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ అడపా వెంకట నాగభూషణం పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాలపై నియంత్రణ ఉండాలి



సదస్సులో పాల్గొన్న విద్యార్థులతో ప్రభావతి

సఖినేటిపల్లి: పాఠశాలలు, గృహాల్లో విద్యుత్ పరికరాల వాడకాన్ని క్రమబద్ధీకరించుకోవాలని ఏపీ ఎన్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి అన్నారు. ఇంధన శక్తి ఆదా అనే అంశంపై బుధవారం సఖినేటిపల్లిలంకలో విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ ఎన్జీసీ, ఏపీ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరుగుతున్న ఏడు రోజుల షెడ్యూల్‌లో భాగంగా ఆరో రోజు ఈ కార్యక్రమాన్ని ఆమె చేపట్టారు. సాధ్యమైనంత వరకూ ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కూలర్ల వాడకాలను క్రమబద్ధీకరించుకుని, బయటకు వెళ్లే క్రమంలో వాటిని స్విచాఫ్ చేయాలన్నారు. తద్వారా ఇంధన శక్తిని ఆదా చేయడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడిన వారవుతారన్నారు. సౌర శక్తిని వినియోగించడం కోసం సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఇంధనాన్ని పొదుపు చేయడంతో పాటు, కాలుష్యాన్ని నివారించడానికి వీలవుతుందని వివరించారు. విద్యా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



ఆలమూరు-3లో చిన్నారులకు టీకాలను అందజేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు, ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. పెదపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజెక్షన్లను అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హైపటైటిస్ బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను, యాంటీ బయోటిక్ మందులను అందజేశారు.

కోఆపరేటివ్ ఎన్నికల నిబంధనలు తెలియజేయాలి



ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందిస్తున్న వీసీకే పార్టీ నేతలు

యానాం: యానాం కోఆపరేటివ్ స్టోర్స్ లిమిటెట్ సంస్థ పాలకమండలి ఎన్నికల నిబంధనలను ముందుగానే తెలియజేయాలని కోరుతూ ఆర్‌ఏఓ మునిస్వామికి వీసీకే పార్టీ యానాం శాఖ కార్యదర్శి మెల్లం శ్రీనివాసరావు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మెల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ కొందరు తమకు కావాల్సినవారికి మాత్రమే సభ్యత్వం ఇచ్చి కోఆపరేటివ్ స్టోర్స్‌ను తమ గుప్పెట్లోకి తీసుకోవాలని భావిస్తున్నారన్నారు. గతంలో స్టోర్స్‌లో ఉన్నత ఉద్యోగిగా పనిచేసి పదవీ విరమణ చేసిన వ్యక్తికి సభ్యత్వం ఇచ్చి ఆయన ద్వారా సంస్థలో చక్రం తిప్పాలని చూస్తున్నారన్నారు. గతంలో స్టోర్స్ ద్వారా జరిగిన మద్యం అమ్మకాలకు సంబంధించి లైసెన్స్ ఫీజు సకాలంలో చెల్లించకపోవడంతో అవి ప్రస్తుతం మూతపడ్డాయన్నారు. కార్యక్రమంలో మోకా బుజ్జి, కందికట్ల శివ, జాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రవేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



పల్లంలో ఒకటో తరగతి విద్యార్థులకు మూల్యాంకన పరీక్ష నిర్వహిస్తున్న ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్

కాట్రేనికోన: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యకు పునాది వేసే విద్యా ప్రవేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అకడమిక్ మానిటరింగ్ అధికారి రాంబాబు పిలుపునిచ్చారు. మండలంలోని పల్లం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యా ప్రవేశ్ పైలెట్ ప్రోగ్రామ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రవేశ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 90 రోజుల పాటు ఒకటో తరగతి విద్యార్థులకు రోజుకు రెండు గంటల చొప్పున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తెలుగు, గణితంపై ఒకటో తరగతి విద్యార్థులు పట్టు సాధించేందుకు ప్రత్యేక సాధన చేయించడం, ఆట, పాటలను నేర్పించడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో 14 జిల్లాల్లో విద్యా ప్రవేశ్ బేస్ లైన్ టెస్టును పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్నారన్నారు. మండలంలో పల్లం, బ్రహ్మసమేధ్యం, చిర్రయానం ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటో తరగతి విద్యార్థులకు ప్రారంభ మూల్యాంకన పరీక్షను ప్రత్యేక సాధనాల ద్వారా శిక్షణ పొందిన ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కేటీవీవీ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం మల్లాడి తేజస్విని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లల్ని స్కూళ్లలో చేర్చాలి



ఊడిమూడిలో సంచార జాతుల వారితో మాట్లాడుతున్న అధికారులు

పి.గన్నవరం: బడి ఈడు పిల్లల్ని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి అన్నారు. నేను బడికి పోతా.. కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ విద్యా సహాయకులు, విద్యా శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 12 వరకూ గ్రామాల్లో పర్యటించి బడి ఈడు పిల్లల్ని గుర్తించి, వారిని సమీపంలోని పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అనంతరం ఊడిమూడి ఏటిగట్టు దిగువన నివసిస్తున్న సంచార జాతుల వారితో మాట్లాడారు. వారి పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓలు కోన హెలీనా, సీహెచ్ వీరభద్రుడు, ఎస్ఎస్ఏ ఏఎల్ఎస్ఎల్ కోఆర్డినేటర్ డి.రమేష్ బాబు, ఏపీఓ ఎంఏకే భీమారావు, సీఆర్ఎంటీ ఆర్.రవీంద్ర, ఎన్.నాగేంద్రప్రసాద్, అరవింద్, జ్యోతి, వనిత, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో చదువు నేర్పిద్దాం



చొప్పెల్లలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఆలమూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో చదువు నేర్పించడంతో పాటు, సరైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ పి.శారద అన్నారు. మండలంలోని చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో బుధవారం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వై.అరుంధతి, బి.వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు సీడీపీఓ శారద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐదేళ్ల లోపు చిన్నారులను సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పకుండా పంపించేలా అంగన్‌వాడీలు కృషి చేయాలన్నారు. అనంతరం సీడీపీఓ శారద ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గత విద్యా సంవత్సరంలో చిన్నారులు నేర్చుకున్న ఆటపాటలు, విద్యను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం పంపిణీ జరుగుతున్న తీరు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు వినియోగించుకుంటున్న వైనాన్ని తెలుసుకున్నారు. ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని ఒకటో తరగతికి అర్హత పొందిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించి, ధ్రువపత్రాలను అందజేశారు.

రిజర్వాయర్లను పరిశీలించిన డీఎల్పీఓ

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, అంతర్వేదిపాలెం పంచాయతీల్లోని మంచినీరు సరఫరా చేసే రిజర్వాయర్లను అమలాపురం డీఎల్పీఓ సి.బోధిరాజు బుధవారం పరిశీలించారు. ట్యాంకుల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రమైన మంచినీటిని సరఫరా చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ పీవీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు కె.బులిసూరన్న, దాసరి సత్యనారాయణ, వైవీవీ కుమార్‌బాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, మాజీ సర్పంచ్ నల్లి సురేంద్ర పాల్గొన్నారు.

22న జాబ్ మేళా

కొత్తపేట: విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.పెద్దిరాజు బుధవారం తెలిపారు. ఐసీఐసీఐ, ఎస్‌బీఐ, ఐటెక్ సాఫ్ట్‌వేర్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. మొత్తం ఖాళీలు 316 ఉన్నాయన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియామక పత్రాలు అందజేస్తారని చెప్పారు. టెన్త్, ఇంటర్మీడియెట్, డిప్లమా, డిగ్రీ అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. అభ్యర్థులు విద్యార్హతల కాపీలతో ఉదయం 9 గంటలకు కళాశాలకు హాజరు కావాలన్నారు. వివరాలకు కళాశాల ప్లేస్‌మెంట్స్ అధికారి డా. జి.శ్రీనివాసులును 81798 24845లో సంప్రదించవచ్చని తెలిపారు.

రమణమూర్తికి ఎస్ఐగా పదోన్నతి



ఎస్ఐగా పదోన్నతి పొందిన రమణమూర్తిని సత్కరించిన కనకాలపేట గ్రామస్తులు

యానాం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కవల వెంకట రమణమూర్తికి ఎస్ఐగా పదోన్నతి కల్పిస్తూ పుదుచ్చేరి పోలీస్‌శాఖ ప్రత్యేక అధికారి ఆర్.ఎలుమలై బుధవారం ఆదేశాలు జారీచేశారు. పదోన్నతి నేపథ్యంలో 90 రోజుల పాటు పుదుచ్చేరి పోలీస్ ట్రైనింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందని ఆదేశాల్లో పేర్కొన్నారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 8 మందికి ఎస్ఐగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన రమణమూర్తిని ఆయన చిన్ననాటి మిత్రబృందం, కనకాలపేట గ్రామస్తులు కోన దేవ, కనకాల వెంకట్రావు, కవల తిరుమలనాయుడు, జక్కపు భైరవస్వామి తదితరులు ఘనంగా సత్కరించారు.

నార్త్ జోన్ క్రికెట్ పోటీలకు ఎంపిక



విద్యార్థి రవితేజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఆకేటి వెంకట రవితేజ నార్త్ జోన్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ మధుసూదనరావు బుధవారం తెలిపారు. ఇటీవల కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ గ్రౌండ్‌లో జరిగిన అండర్–16 క్రికెట్ సెలక్షన్‌లో రవితేజ జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి జిల్లా జట్లు పోటీల్లో పాల్గొంటాయని పీడీ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూకల సత్యనారాయణ, పీఈటీ కరాటం ప్రసాద్, గ్రామస్తులు రవితేజను అభినందించారు.

కపిల ఆవు దూడ జననం



గాడవిల్లిలో జన్మించిన ఆవు దూడ

ఉప్పలగుప్తం: మండంలోని పెదగాడవిల్లి గ్రామంలో ఉంగరాల బ్రహ్మానాయుడు అనే రైతుకు చెందిన పుంగనూరు ఆవుకు బుధవారం కపిల ఆవుదూడ జన్మించింది. మెదటి ఈతలోనే అరుదైన కపిల ఆవు దూడ జన్మించడంపై రైతు ఆనందం వ్యక్తం చేశాడు. దూడ ఎత్తు 17 అంగుళాలు ఉందని, పశువులపై మక్కువతో ఈ అరుదైన జాతిని కాపాడుకోవడానికి తన వంతు ప్రయత్నం చేస్తున్నానని రైతు బ్రహ్మానాయుడు వివరించారు. ఆవు, దూడ చూడముచ్చటగా చూపురులను కట్టి పడేస్తున్నాయి.

అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఇక్బాల్ మృతి



ఇక్బాల్(52)(ఫైల్)

యానాం: యానాం కోపరేటివ్ శాఖలో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ మహబూబ్ ఇక్బాల్(52) బుధవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను మంగళవారం యానాం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం చనిపోయారు. గతంలో ఆయన పీడబ్ల్యూడీ, ఆర్‌ఏఓ ఆఫీసు, రెవెన్యూ తదితర శాఖల్లోనూ వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయన మృతికి వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, స్థానిక మసీదు కమిటీ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

30న హోంగార్డు ఉద్యోగ పరీక్ష

యానాం: ఈ నెల 30న హోంగార్డు ఉద్యోగాలకు 12 పరీక్షా కేంద్రాల్లో పోటీ పరీక్ష నిర్వహించనున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్‌శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పుదుచ్చేరిలో జరిగే రాత పరీక్షకు ఫిజికల్ టెస్ట్‌లో అర్హత సాధించిన 3034 మంది పురుష అభ్యర్థులు, 1195 మంది మహిళా అభ్యర్థులు హాజరవుతారన్నారు. అభ్యర్థులు ఈ నెల 26 నుంచి 'రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఈ నెల 20 నుంచి 0413-2233338 ఫోన్ నెంబరులో సంప్రదించొచ్చన్నారు.